# టీచర్ ఉద్యోగం నుంచి గ్రూప్ -2 అధికారి వరకు...!

## గిడిజాల యువకుడి ప్రతిభ



ఆనందపురం, జనవరి 29, ప్రభాతవార్త

ఆనందపురం మండలంలోని గిడిజాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న షినగం వెంకట సూర్యనారాయణ గ్రూప్–2 ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను పూర్తి చేశాడు. ఎప్పటికైనా ప్రజలకు సేవ చేసే ఉద్యోగాన్ని సాధించాలని ఎంతో పట్టుదలతో రాత్రి, పగలు కష్టపడి చదివి అనుకున్న ఉద్యోగాన్ని సాధించాడు. చిన్నప్పుడే తల్లిని కోల్పోయిన వెంకట సూర్యనారాయణ మొదట ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాడు. ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే ఉన్నత ఉద్యోగ వేట మొదలు పెట్టాడు. గతంలో గ్రూప్–2 ఉద్యోగానికి ఎంపికైన తాను ఆశించిన డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం రాలేదని వదులుకున్నాడు. 2008లో జరిగిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా, సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఒకేసారి ఎంపికయ్యాడు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ గానే కొనసాగుతున్నాడు. 2009లో రైల్వే శాఖలో గ్రూప్–సి ఉద్యోగం వచ్చిన వెళ్లలేదు. 2017లో గ్రూప్–2 పరీక్ష రాసి జోన్‌లో 42 ర్యాంకు సాధించి ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. కానీ ఆ ఉద్యోగాన్ని కూడా వదులుకొని మరలా ప్రయత్నం చేసి సచివాలయంలో జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్ మెంట్ లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగాన్ని సాధించాడు. దీంతో మండలంలో గల పలు గ్రామాల నాయకులు, అధికారులు సూర్యనారాయణను అభినందించారు.

# డిప్యూటీ తహశీల్దారుగా వేములవలస యువతి ఎంపిక

ఆనందపురం, జనవరి 29, ప్రభాతవార్త:



ఆనందపురం మండలంలోని వేములవలస గ్రామానికి చెందిన జోగ లావణ్య సంతోషి సాయి శ్రీ ఆరాధన డిప్యూటీ తహసీల్దారుగా ఎంపికయింది. ఆమె హైస్కూల్ విద్యను ఆనందపురం మండలం లోని గుడిలోవ విజ్ఞాన విహార్ లోను, కళాశాల విద్యను కొమ్మాది గాయత్రి కళాశాలలోనూ అభ్యసించారు. ఆమె తల్లి వెంకట పద్మ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుండగా తండ్రి శ్రీనివాసరావు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ మొదటి నుంచి ప్రజలకు సేవ చేయాలనే తపన ఉండేది అన్నారు. ఈ మేరకు నిరంతరం శ్రమించి ప్రజలకు సేవా చేయగలిగే ఉద్యోగాన్ని సాధించానని చెప్పారు. తన విజయం వెనక తల్లిదండ్రులు ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. కాగా డిప్యూటీ తహసిల్దార్‌గా ఉద్యోగం ఎంపికైన లావణ్యను మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులు అభినందించారు.

# ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆనందపురం, జనవరి 29, ప్రభాతవార్త:

మండలంలోని లొడగలవానిపాలెంలో గురువారం అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఆలయ ధర్మకర్తలు బమ్మిడి సూర్యనారాయణ, ఉమాదేవి దంపతలు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పంచామృతాభిషేకాలు, నవగ్రవ సహిత మండపారాధన, తమలపాకులు, అరటి పండ్లు, సింధూర సహిత, సహస్ర నామార్చన, హోమములు నిర్వహించారు. పరిసర ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

# ముచ్చర్లలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా శిబిరం

ఆనందపురం, జనవరి 29, ప్రభాతవార్త



మండలంలోని ముచ్చర్లలో విశ్వనాథ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు గ్రామంలో గల చెత్తా చెదారాలను తొలగించి శుభ్రపరిశారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై అందరికీ అవగాహన కలిగించారు. అనంతరం గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల సర్పంచ్ ఎస్ ఎర్రయ్య, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఉమాదేవి, చైర్మన్ వి.నాగేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.సౌధామిని తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలో శ్రమ దాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపరిసరాలను శుభ్రం చేశారు.

# వెల్లంకిలో ఉచిత వైద్య శిబిరం

ఆనందపురం, జనవరి 29, ప్రభాతవార్త:



ఆనందపురం మండలం వెల్లంకిలో ఉన్న సుబ్బి రామిరెడ్డి కళ్యాణ మండపంలో గురువారం గాయత్రి అస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు ఈ శిబిరంలో డాక్టర్.బి.జె. రామ మోహన్ (జనరల్ సర్జన్) డాక్టర్.సుగుణ(ఆర్థోపెడిక్) డాక్టర్. ఉమ (డెర్మటాలజీ) డాక్టర్ మాధురీ (జనరల్ మెడిసిన్) వైద్య సేవలు అందించారు. సాధారణ వ్యాధులతో పాటు కంటి సంబధిత వాటికి సుమారు 200 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బి.పి, షుగర్ పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ రావు, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యులు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి, జోనల్ కోశాధికారి కనకరావు, జోనల్ అడ్వయిజర్, కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ సెక్రటరీ కోన. ప్రకాశ్, ప్రసాద్ రావు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు రూ.లక్ష పరిహారం

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)

విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా హిట్ అండ్ రన్ కేసులో గాయపడిన ఇద్దరు బాధితులకు రూ.లక్ష పరిహారం అందజేశారు. పీ.ఎం.పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హిట్ అండ్ రన్ ప్రమాదంలో గాయపడిన మధురవాడ, కొమ్మాది సమీపంలోని పరదేశిపాలెంకు చెందిన బొర్రా అప్పలరెడ్డి, ఓల్డ్ డైరీ ఫాం, ఇందిరానగర్‌కు చెందిన అనగాని వెంకట సత్యనారాయణ లకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున మొత్తం రూ.లక్ష పరిహారాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం అందే వరకు అవసరమైన సహకారం అందించడమే లక్ష్యంగా ఈ సహాయక కేంద్రం పనిచేస్తోం దని తెలిపారు. ఈ కేంద్రం తీసుకున్న చర్యల వల్ల ఇప్పటివరకు విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసుల్లో 111 మంది బాధితులకు మొత్తం రూ.91,50,000 లు పరిహారం అందించినట్లు వెల్లడించారు. హిట్ అండ్ రన్ కేసుల్లో పరిహారం పొందేందుకు సహాయం కావలసిన వారు రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రాన్ని లేదా సెంటర్ నంబర్ 7995095793ను సంప్రదించవచ్చని సూచించారు.

# ఆనందపురం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

ఆనందపురం, జనవరి 29, ప్రభాతవార్త:



ఆనందపురం ప్రెస్ క్లబ్ (ఆనందపురం జర్నలిస్టుల సంక్షేమ సంఘం) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండలంలోని వేములవలస–బీపీ కల్లాల రోడ్ లో ఉన్న శుభశ్రీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా డబ్బీరు విజయ్ కుమార్ (ఆంధ్రప్రభ), గౌరవ అధ్యక్షులుగా మహంతి శివాజీ (వార్త), క్రమశిక్షణ కమిటీ కన్వీనర్‌గా రెడ్డి విజయ లక్ష్మయ్య (ఆంధ్రజ్యోతి), గౌరవ సలహాదారుగా గండేటి రవికిషోర్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దొంతల చిన్న శ్రీను (ప్రజాశక్తి), కోశాధికారిగా రౌతు నాగరాజు (విశాలాంధ్ర), ఉపాధ్యక్షులుగా ఎరుకొండ అప్పలరాజు (సూర్య) బంటుపల్లి జగన్ (ఆంధ్ర పదం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా చందక శంకర్ (లీడర్), కార్యదర్శిగా దళాయి శివ (ఓఎస్‌జి న్యూస్), సహాయ కార్యదర్శిగా గురువులు (వైజాగ్ ఎక్స్‌ప్రెస్) ఎన్నికయ్యారు. సభ్యులుగా రెడ్డి విజయరామయ్య, పాండ్రంకి ప్రసాద్, మతికాన నారాయణరావు, తమ్మిన వెంకటరమణ, తూర్పాటి నరసింహమూర్తి, ఆకుల త్రిమూర్తులు, బంక శంకర్రావు, ముడసల శ్రీను, ఉప్పాడ నవీన్, వెన్ని అప్పలరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

# కారాగారాలు కేవలం నిర్బంధ కేంద్రాలు మాత్రమే కాదు..

**మానవ గౌరవం, పునరావాసం, సామాజిక పునఃఏకీకరణ బాధ్యతలు కలిగిన క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో కీలక స్తంభాలు -రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత -విశాఖలో ముగిసిన జాతీయ కారాగార పరిపాలకుల సదస్సు - కీలక విధాన చర్చలు**



(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)

కారాగారాలు కేవలం నిర్బంధ కేంద్రాలు మాత్రమే కాదు.. మానవ గౌరవం, పునరావాసం, సామాజిక పునఃఏకీకరణ బాధ్యతలు కలిగిన క్రిమినల్ జస్టిస్ వ్యవస్థలో కీలక స్తంభాలనీ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఆంధ్రప్రదేశ్ కారాగార శాఖ ఆధ్వర్యంలో, న్యూఢిల్లీకి చెందిన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (బిపిఆర్ అండ్ డీ) సహకారంతో నిర్వహిస్తున్న 9వ జాతీయ కారాగార పరిపాలకుల సదస్సు ముగింపు సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కారాగార పరిపాలనకు సంబంధించిన ముఖ్య విధానాలు, కార్యాచరణ సవాళ్లపై సారవంతమైన చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భద్రత, క్రమశిక్షణతో పాటు ఆధునీకరణ, సాంకేతికత ఆధారిత పరిపాలన, మానవీయ కరెక్షనల్ ఆచరణల అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనా సంస్కరణలు, మానవీయ ప్రజా సంస్థలపై ఉన్న దృష్టిని హోం మంత్రి ప్రశంసించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపట్టిన చారిత్రక క్రిమినల్ లా సంస్కరణలు, ముఖ్యంగా భారతీయ నాగరిక సురక్షా సంహిత ప్రవేశపెట్టడాన్ని అభినందించారు. ఈ సంస్కరణలకు నాయకత్వం వహించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో రూపొందించిన సిఫార్సులను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కాలపరిమితితో, ఫలితాలపై దృష్టి పెట్టి అమలు చేయాలని హోం మంత్రి సూచించారు.సదస్సు రెండవ రోజు ప్రారంభంలో సిండికేట్ గ్రూప్ చర్చలు నిర్వహించగా, సీనియర్ కారాగార అధికారులు, అంశ నిపుణులు నాలుగు సమాంతర గ్రూపులుగా విభజించి పేద ఖైదీలకు సహాయ పథకాలు, కారాగారాల ఆధునీకరణ ప్రాజెక్టుల సమర్థవంతమైన అమలు, మోడల్ ప్రిజన్ మాన్యువల్--2016, మోడల్ ప్రిజన్స్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ చట్టం--2023 స్వీకరణలోని సవాళ్లు, భారతీయ నాగరిక సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 479 అమలు వంటి అంశాలపై లోతైన చర్చలు జరిపారు. అలాగే ఆధార్ ప్రమాణీకరణ, వీడియో కాన్ఫరెన్సింగ్, టెలి–మెడిసిన్, సాంకేతిక పరికరాల ఆడిట్ ద్వారా కారాగారాల్లో సాంకేతికత వినియోగం, కారాగార శిక్షణా సంస్థల ప్రమాణీకరణ, గుర్తింపు (అక్రెడిటేషన్) అంశాలపై వ్యూహాలు రూపొందించారు. అనంతరం నాలుగు సిండికేట్ గ్రూపుల తీర్మానాలు, సిఫార్సులు వేదికపై ప్రదర్శించబడ్డాయి. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కారాగారాలు అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్, ఒడిశా కారాగారాల డీజీ సుసంత్ కుమార్ నాథ్ (ఐపీఎస్), బిపిఆర్ అండ్ డీ అదనపు డైరెక్టర్ జనరల్ రవి జోసెఫ్ లోక్కు, తెలంగాణ కారాగారాల డీజీ సౌమ్య మిశ్రా పాల్గొన్నారు. చర్చల అనంతరం దేశవ్యాప్తంగా కరెక్షనల్ పరిపాలనను బలోపేతం చేసే కార్యాచరణాత్మక సిఫార్సులు రూపొందించబడ్డాయి. తదనంతరం తొలి రోజు, రెండవ రోజు సెషన్ల మోడరేటర్లతో ఓపెన్ హౌస్ చర్చ నిర్వహించగా, ఉత్తమ ఆచరణలపై విస్తృత స్థాయిలో అభిప్రాయాల మార్పిడి జరిగింది. అనంతరం బిపిఆర్ అండ్ డీ (రీసెర్చ్ అండ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్) ఇన్స్పెక్టర్ జనరల్ సదస్సు నివేదికను సమర్పించారు. అనంతరం కృతజ్ఞతా తీర్మానం ప్రవేశపెట్టగా, జాతీయ గీతంతో సదస్సు ముగిసింది.

# రమణీయం లీలా మాధవ స్వామి కళ్యాణం

## వందలాదిగా తరలివచ్చిన భక్తజనం

మాధవధార, జనవరి 29, ప్రభాతవార్త



మాధదారలో గల మాధవస్వామి ఆలయంలో లీలా మాధవస్వామి కళ్యాణం అత్యంత రమనీయంగా జరిగింది.గురువారం భీష్మ ఏకాదశి సందర్భంగా భక్తులు వేకువ జాము నుంచి జలదారలో స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం మాధవస్వామి ఆలయ అర్చకులు సనపల వరాహ నరసింహ,సనపల శ్రీనివాసం, సనపల గోవింద,సనపల రవీంద్ర పర్యవేక్షణలో శ్రీదేవి భూదేవి సహిత మాధవ స్వామి వారి కళ్యాణం సింహాచల దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా మేళ తాళాల మధ్య వేదమంత్రాల నడుమ వైభవంగా జరిగింది.ఉత్సవమూర్తులను మండపంలో అధిష్టింపజేసి, కళ్యాణంలో పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పం చెప్పి శ్రీకారం చుట్టారు. జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ ప్రక్రియలను కమనీయంగా నిర్వహించారు. భక్తులకు వేద ఆశీర్వచనం అందజేసి అనంతరం మాధవధార పురవీధుల గుండా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.అదే విధంగా మాధవధారలో గల వేణుగోపాల స్వామి ఆలయంలో వేణుగోపాల స్వామి కళ్యాణం అత్యంత కమనీయంగా దేవస్థానం అర్చకులు,సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# జీవీఎంసీ 87వ వార్డులో పార్కులు అభివృద్ధి చేయాలని వినతి



గాజువాక,జనవరి 29,ప్రభాతవార్త

జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో గల అన్ని పార్కులను అభివృద్ధి చేయాలని కోరుతూ వార్డ్ వైకాపా నాయకులు గ్రేటర్ విశాఖ కార్యదర్శి బివి రమణను గురువారం కలిసి వినత పత్రం అందజేసారు. వాకింగ్ ట్రాక్ పూర్తి అందుబాటులోకి తేవాలని, బోర్ కు మీటర్ ఉన్న పవర్ సప్లై లేదని, పార్కు పూర్తిగా గ్రీనరీ కల్పించాలని, తిరుగుడు గేటు కొత్తది ఏర్పాటు చేయాలని, కళింగ వీధిలో ఉన్న పార్కులో కొంతమంది వ్యక్తులు పశువులు కడుతున్నారని వాటిని నియాంత్రించాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగిందని నాయకులు తెలిపారు. వార్డు అధ్యక్షులు బొడ్డ గోవిందు, చిత్రాడ వెంకటరమణ ప్రగడ శ్రీనివాస్ ముద్దపు దామోదర్ పాల్గొన్నారు.

# నేత్ర గాయాలపైన జాతీయ అంతర్జాతీయ నిపుణుల కార్యశాల

ఆరిలోవ, జనవరి 29, ప్రభాతవార్త




ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య శాల కంటి ట్రామా పైన అవగాహన శిక్షణ పైన రెండు రోజుల కార్యశాల నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ వ్యాప్తంగా సుమారు 30 మంది రెసిడెంట్స్, ప్రాక్టీష నరులు ఈ కార్యసా లలో పాల్గొన్నారు. అనంతరం ఆధారిత చర్చలు, సాక్ష్యం–ఆధారిత ఉపన్యాసాలు, కార్నియల్, రెటీనా, ఓక్యులోప్లాస్టిక్, న్యూరో–ఆప్తాల్మిక్ ట్రామాను సంరక్షించు పలు అంశాల పైన చర్చలు అదేవిధంగా యువ నేత్ర వైద్య శిక్షణార్థులకు ప్రత్యేక ఆచరణాత్మక శిక్షణ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యశాల నందు దేశవ్యాప్తంగా 19 మంది జాతీయ బోధకులు, ముగ్గురు విదేశాల నుండి 3 అధ్యాపకులు (ప్రొఫెసర్ ఆర్నే వీస్టెంజ్,హాలే విశ్వవిద్యాలయం–జర్మనీ, డాక్టర్ రూపేష్ అగర్వాల్, నేషనల్ హెల్త్‌కేర్ గ్రూప్ ఐ ఇన్స్టి ట్యూట్, సింగపూర్ మరియు డాక్టర్ ఫాసికా ఎ వోరెటా, యూఎస్ ఎ–విల్మర్ ఐ ఇన్స్టిట్యూట్) పాల్గొని ఆచరణాత్మకమైన నైపుణ్యతలలో విశిష్ట శిక్షణను వివరించారు. ఈ సందర్భంగా ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ జషన్‌దీప్ సింగ్ మాట్లాడుతూ కంటి ట్రామా కేర్‌లో ప్రపంచ సహకారాన్ని ఈ కార్యశాల ప్రతిబింబిస్తున్నాదని, ఆచరణాత్మక వెట్ ల్యాబ్ సెషన్‌లు యువ నేత్ర వైద్య నిపుణులను సంక్లిష్ట కేసులను విశ్వసనీయతతో నిర్వహించుటకు, అత్యవసర ప్రతిస్పందనలతో అనేకమంది రోగుల దృష్టిని కాపాడటానికి ఆచరణాత్మక నైపుణ్యాతల పట్ల మంచి అవగాహన కలిగించినదన్నారు.

# జూపార్క్‌లో సందర్శికులు ఇక్కట్లు

**డిప్యూటీ సీఎం రాకతో సందర్శికులు గంటల తరబడి నిరీక్షణ -జూ అధికారులు తీరుపై మండిపడ్డ సందర్శికులు -నిరాశతో వెనుతిరిగిన సందర్శికులు**

ఆరిలోవ, జనవరి 29, ప్రభాతవార్త



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జూ పార్క్‌ను గురువారం సందర్శించారు. ఈ నేపథ్యంలో జూ పార్క్‌ను చూసేందుకు వచ్చిన సందర్శ కులకు జూ అధికారులు జూ లోపాలకు అనుమతించక పోవడంతో ప్రధాన ద్వారం వద్ద గంటల తరబడి నిరీక్షించి నానా అవస్థలు పడ్డారు. సందర్శికులు వారి వారి కుటుంబ సభ్యులతో కలిసి రోజంతా సరదాగా గడిపేందుకు దూర ప్రాంతాల నుండి జూ పార్క్ ను చూసేందుకు తరలి వస్తుంటారు. సాధారణంగా జూ పార్క్‌కు నగరవాసులే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి టూరిస్టులు ఎక్కువగా వస్తుంటారు. అయితే ఎటువంటి సమాచారం లేకుండా టికెట్ కౌంటర్లు క్లోజ్ చేసి జూ లోపలకి అనుమతించకపోవడంపై జూ అధికారుల తీరు పై సందర్శికులు మండిపడ్డారు. వృద్ధులు, చిన్నారులు మండే ఎండలో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నిరీక్షించి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి వెనుతిరిగారు.

# సజ్జల రామకృష్ణారెడ్డితో గాజువాక వైయస్ఆర్‌సీపీ భేటీ

గాజువాక,జనవరి 29,ప్రభాతవార్త



వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ ఇంచార్జ్ తిప్పల శ్రీనివాస్ దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో గాజువాక నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామ కృష్ణారెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లా డుతూ గాజువాక నియోజకవర్గంలో తిప్పల దేవన్ రెడ్డి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను ప్రజలకు తెలియ జేసేలా పార్టీ ఆదేశాల మేరకు విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని, 2029లో వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరల ముఖ్యమంత్రిగా నిలబెట్టేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్టుపూడి పరదేశి, పల్లా చిన్నతల్లి,నక్క వెంకటరమణ, మంత్రి శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఒడిశా గవర్నర్ హరిబాబును కలిసిన డా.కేఎన్ఆర్

గాజువాక,జనవరి 29,ప్రభాతవార్త



ఒడిశా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబును భువనేశ్వర్ రాజ్ భవన్‌లో బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ కరణంరెడ్డి నరసింగరావు గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజ్ భవన్‌లో ఉద్యోగులకు ఉచిత ఈవీ చార్జింగ్ సదుపాయం, సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ వినియోగం కాలుష్య నియంత్రణకు దోహదపడుతోందని డా.కేఎన్ఆర్ తెలిపారు. గవర్నర్ హరిబాబు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.

# 65వ వార్డు సమస్యలపై మేయర్‌కు కార్పొరేటర్ వినతి

గాజువాక,జనవరి 29 ప్రభాతవార్త



జీవీఎంసీ 65వ వార్డులోని దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు గురువారం మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కొండ వాలు ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణం. ప్రధాన కాలువల పునర్ని ర్మాణం, సామాజిక భవనాల ఏర్పాటు. వేసవి దృష్ట్యా తాగునీటి పైపులైన్ల విస్తరణ, నీటి ఎద్దడి నివారణ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అంద జేశామని ఈ సమస్యలపై మేయర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే వార్డులో పర్యటించి పనులను పరిశీలిస్తానని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.

# అలరించిన శ్రీ శివ సాయి సినీ సంగీత విభావరి

విశాఖపట్నం, జనవరి 29, ప్రభాతవార్త




శ్రీ శివ సాయి సాంస్కృతిక సినీ సంగీత సంస్థ ఆధ్వర్యంలో "పల్లెకు పోదాం పారుని చూద్దాం" శీర్షికన గురువారం సాయంత్రం అక్కయ్య పాలెం దాలి రాజు మార్కెట్ సమీపంలో గల స్వరాలయ స్టూడియో లో సంస్థ 29వ సినీ సంగీత విభావరిని సంస్థ అధ్యక్షులు వివిఎం గోపాల రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భాన్ని పురస్కరించుకొని సంస్థ గాయనీ, గాయకులు పద్మశ్రీ ఘంటసాల,పి సుశీల, ఎస్ పి బాలుల ఆలపించిన సినీ మధుర గీతాలను సంస్థ సభ్యులు బంగార్రాజు, వివిఎం గోపాల రావు, శ్యాం సుందర్, భయ్యా శ్రీనివాస్, మనుపల్ల, సాత్విక, నాగ లక్ష్మి, మాధురి, అప్పా రావు, రత్న కుమారి, ఎస్ ఎస్ ఎస్ ఎన్ రాజు తదితర గాయనీ, గాయకులు సినీ గీతాలను మధురంగా ఆలపించారు.

# ఎం వి రాజశేఖర్ ఆధ్యాత్మిక ప్రసంగం



విశాఖపట్నం జనవరి 29 ప్రభాతవార్త

జగదల్పూర్ బాలాజీ మందిరం 25వ వార్షికోత్సవ సందర్భంగా ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు విశాఖ నగరానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవి రాజశేఖర్ పాల్గొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి అవతార విశిష్టత మరియు గోవిందనామం ప్రాముఖ్యత పై చక్కని వచనాలతో ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జయరామ్ , మాదాల శ్రీనివాస్ ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ పాంచరాత్ర ఆగమ కోవిదులు శ్రీమాన్ రేజేటి రామానుజాచార్యులు పాల్గొన్నారు . అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఎండి పేరుతో..వాట్సాప్ మెసేజ్ ద్వారా రూ.80 లక్షల మోసం


**పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ఆశ్రయించిన బాధితురాలు -చాకచక్యంగా వ్యవహరించి సైబర్ మోసగాళ్లకు చెక్ పెట్టిన విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు -రూ.60.99 లక్షలు బాధితురాలికి తిరిగి చెల్లింపు**

(విశాఖ క్రైమ్ – ప్రభాతవార్త)

సైబర్ మోసానికి గురైన మహిళకు భారీ మొత్తంలో నగదును తిరిగి ఇప్పించడంలో విశాఖపట్నం సైబర్ క్రైమ్ పోలీసులు కీలక పాత్ర పోషించారు. నగరానికి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న మహిళ, సైబర్ మోసగాళ్ల వలలో పడి రూ.80 లక్షలు కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తమ కంపెనీ ఎండీ పేరుతో వాట్సాప్ ద్వారా 'అత్యవసరంగా డబ్బు పంపాలి' అంటూ వచ్చిన సందేశాన్ని నమ్మిన ఆమె, ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాకు ఆర్టీజీఎస్ ద్వారా రూ.80 లక్షలను ట్రాన్స్‌ఫర్ చేశారు. సాధారణంగా కూడా ఎండీ ఆదేశాల మేరకు లావాదేవీలు నిర్వహిస్తుండటంతో, ఎలాంటి అనుమానం రాలేదని బాధితురాలు తెలిపింది. అయితే, అనంతరం ఎండీని సంప్రదించగా, ఆయన పేరుతో సైబర్ మోసగాళ్లు నకిలీ వాట్సాప్ ఖాతా సృష్టించి మోసానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన సైబర్ పోలీసులు, సంబంధిత ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాను తక్షణమే ఫ్రీజ్ చేయించి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా వివిధ బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.72,09,143 లు నిలిపివేయగా, అందులో ఐసీఐసీఐ బ్యాంకులో రూ.60,99,638 లు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. కోర్టు అనుమతి అనంతరం, ఈ నెల 29న ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.60,99,638 లను బాధితురాలి ఖాతాలో తిరిగి జమ చేయించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం వల్లే ఈ మొత్తాన్ని రికవరీ చేయగలిగామని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

## ప్రజలకు సైబర్ క్రైమ్ పోలీసుల హెచ్చరికలు..

కార్యాలయాల పేరుతో వచ్చే వాట్సాప్, ఎస్ఎంఎస్, ఈమెయిల్ సూచనలను వెంటనే నమ్మవద్దనీ పోలీసులు సూచించారు. అత్యవసరం, మీటింగ్‌లో ఉన్నాను, ఓటీపీ ఇవ్వలేను, వంటి మాటలు సైబర్ మోసాల సంకేతాలు కావచ్చనీ, పెద్ద మొత్తంలో డబ్బు పంపే ముందు తప్పనిసరిగా రెండుసార్లు నిర్ధారించుకోవాలన్నారు. యజమాని లేదా ఉన్నతాధికారుల పేరుతో వచ్చే నకిలీ వాట్సాప్ అకౌంట్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నీ, మోసం జరిగిన వెంటనే 1930కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలన్నారు. ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు



## తిరుమలలో కల్తీ నెయ్యి పాపం వైసీపీదే -టీడీపీ ఇన్‌చార్జ్ పడాల భూదేవి



సీతంపేట, జనవరి 29 ప్రభాతవార్త : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూలు తయారీలో వినియోగించిన కల్తీ నెయ్యి పాపం వైసీపీ పార్టీదేనని టీడీపీ ఇంచార్జ్ పడాల భూదేవి స్పష్టం చేశారు. సీతంపేట వెంకటేశ్వర ఆలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గురువారం టీడీపీ ఇంచార్జ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పాపం నిజం అనే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా వెంకటేశ్వర ఆలయంలో ముఖ ద్వారం ఆలయాన్ని పసుపు నీటితో శుద్ధి చేసారు. వైసీపీ ప్రభుత్వ పెద్దలు కల్తీ నెయ్యితో జంతువుల కొవ్వుతో తయారు చేసిన సింథటిక్ నెయ్యితో, పామాయిల్ మరియు కెమికల్ కలిపిన ద్రవంతో 21 కోట్ల లడ్డూ ప్రసాదం తయారు చేసి రూ.251 కోట్లు దోచుకుని మహా పాపానికి తెర తీశారని ఆరోపించారు. నేడు సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో జరిగిన సిట్ దర్యాప్తులో నిజం బయటపడింది. వైసీపీ నాయకులు ఇప్పుడు ఏమంటారని భూదేవి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్, పాలకొండ మండల అధ్యక్షులు గండి రామినాయుడు, అరకు పార్లమెంట్ కార్యదర్శి బిడ్డిక జయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ పాలక రాజబాబు, మాజీ ఎంపీపీ సవర కుంపి, ఐటీడీపి కో ఆర్డినేటర్ దిలీప్, సవర కూర్మారావు, సవర భాస్కరరావు, సవర బాలరాజు, సంతోష్, కొండగొర్రి విశ్వనాథం, మాజీ ఎంపీటీసీ సవర తోటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



కవిటి, జనవరి 29 ప్రభాతవార్త: కవిటి పట్టణంలోని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ఆవరణలో భీష్మ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణ పరమాత్మ, అర్జునుడు, భీష్ముడు, వేషధారణలో భీష్మ ఏకాదశి యొక్క విశిష్టతను విద్యార్థులకు మైథాలజీ ఉపాధ్యాయులు బెందాళం శివాజీ తెలియజేశారు. అనంతరం ఆయన భీష్మ ఏకాదశి విశిష్టత విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీష్ముడు దింపేసిన రోజు ఈరోజు అని కురుక్షేత్ర యుద్ధం తర్వాత భీష్మ పితామహుడు అంపశయ్యపై ఉంది సూర్యుడు ఉత్తరాయణంలోకి ప్రవేశించాక మరణించాలని కోరుకొని అలా ఉత్తరాయణంలోకి నాగశుద్ధ ఏకాదశి రోజున భీష్ముడు తన ప్రాణాలను విడిచిపెట్టాడు ఆ కారణంగా ఆ రోజును భీష్మ ఏకాదశిగా జరుపుకుంటారని విద్యార్థులకు తెలియజేశారు. భీష్ముడు అంపశయ్యపై ఉన్నప్పుడు ధర్మరాజుకు విష్ణు సహస్రనామాలను శ్రీకృష్ణ భగవానుని స్మరిస్తూ ఉపదేశించడం వలన ఈ పవిత్రమైన విష్ణు సహస్రనామాలు ఆ రోజు నుండి యావత్ లోకానికి తెలియజేయడం జరిగిందని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ బిందు మాధవి ఆధ్వర్యంలో మైథాలజీ ఉపాధ్యాయునికి చిరు సత్కారం చేయడం జరిగిందని తెలియజేశారు. అనంతరం మూడవ అధ్యాయంపై విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంతోష్ పవిత్రతో పాటు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మామిడి అప్పారావుకి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం, జనవరి 29 ప్రభాతవార్త: పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) తండ్రి మామిడి అప్పారావు 26వ వర్ధంతి సందర్భంగా గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో వారి తండ్రి అప్పారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి గోవిందరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ తన తండ్రి అప్పారావు బ్రతికినంత కాలం కుటుంబ శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమించి కుటుంబాన్ని ఉన్నత స్థాయిలో నిలిచేలా చేశారని, జీవితాంతం విలువలకే కట్టుబడిన మహోన్నత వ్యక్తిత్వం కలిగిన మహనీయుడని, చిన్నప్పటి నుంచే ఉన్నత ఆశయాలు, విలువలతో కూడిన సామాజిక స్పృహతో తమని పెంచారని ఆయన అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, అలాగే తమ కుటుంబానికి ఎల్లవేళలా తన తండ్రి ఆశీస్సులు అందిస్తూ ఉంటారని గోవిందరావు పేర్కొన్నారు.

## బిజెపిలో చేరిన మహేష్‌కు విక్రమపురంలో ఘన స్వాగతం



వీరఘట్టం, జనవరి 29 ప్రభాతవార్త : బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ చేతుల మీదుగా బిజెపి పార్టీలో చేరిన సర్పంచ్ మాచర్ల మహేష్‌కు మండలంలోని విక్రమపురం గ్రామంలో బుధవారం రాత్రి ఆయనకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. బిజెపి కండువాతో గ్రామంలోకి అడుగుపెట్టిన వెంటనే యువత పెద్ద ఎత్తున జేజేలు పలుకుతూ, కేరింతలు కొడుతూ, బాణాసంచా కాలుస్తూ... మా నాయకుడు మహేష్, మా నాయకుని వెంటే మేము.. బిజెపికి అండగా ఉంటామంటూ వారంతా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మహేష్‌ను దుశ్శాలువతో సత్కరించి మెమోంటోను అందజేశారు. మహేష్‌ను సత్కరించేందుకు యువత అంతా పోటీపడ్డారు. అంతటితో ఆగకుండా కేకును కట్ చేయించి, ఆయనతో తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన జనసైనికుడికి ఆర్థిక సాయం



మెళియాపుట్టి, జనవరి 29 ప్రభాతవార్త గత కొద్దిరోజులు క్రితం పరుశురాంపురం పంచాయతీ హీరాపురం గ్రామంలో ముడిదాన జానకిరావు అనే యువకుడుకి బైక్ యాక్సిడెంట్ జరగడం వలన తన కుడి కాలుకి ఆపరేషన్ చేయడం జరిగింది. ఇది తెలుసుకున్న పాతపట్నం నియోజకవర్గ నాయకురాలు కొరికాన భవాని ఆ కుటుంబానికి రూ.20,000ల నగదు మరియు పళ్ళు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దుక్క బాలరాజు, సవర రామూర్తి, వసుంధర సర్పంచ్ సలాన అప్పలనాయుడు, లక్ష్మిపురం కిరణ్, పత్రి పణికంఠ, కవులు శివ, దొర విజయ్ మరియు జనసైనికులు పాల్గొన్నారు.

## శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పూజలు



కంచిలి, జనవరి 29 ప్రభాతవార్త కంచిలి మండలం కొల్లూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో మాఘమాస శుక్లపక్ష ఏకాదశి (భీష్మ ఏకాదశి) పూజలు ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సమయం నుండి భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు నిర్వహించి జగన్నాథ స్వామికి పూజాద్రవ్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పద్మనాభ పాడి భీష్మ ఏకాదశి ప్రాశస్త్యం భక్తులకు వివరించారు. మాఘమాస శుక్ల పక్షం ఏకాదశి శ్రీ మహావిష్ణువుకు అత్యంత పవిత్రమైన దినమని మహాభారతంలో భీష్మ పితామహుడు ఈ రోజే దేహత్యాగం చేసినట్లు శాస్త్రాల్లో చెప్పబడిందని, ఈ రోజు ఉపవాసం చేసి శ్రీ మహావిష్ణువును భక్తితో పూజిస్తే పాపాలు నశిస్తాయని, భీష్మ పితామహుడు విష్ణు భక్తునిగా మోక్షాన్ని పొందాడు కాబట్టి ఈ ఏకాదశినీ భీష్మ ఏకాదశిగా పిలువబడిందని ఈ రోజు ఉపవాసం ఉండటం, అన్నదానం, వస్త్రదానం చేస్తే చాలా శుభప్రదమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏ.ఓ బెండి రామారావు పాల్గొన్నారు.

## చౌదరి కొత్తూరు మహిళా డైరీ సహకార సంఘం



కోటబొమ్మాళి, జనవరి 29 (ప్రభాతవార్త): కురుదు పంచాయతీ, చౌదరి కొత్తూరు గ్రామంలో 11 మంది మహిళా సభ్యులతో కూడిన మహిళా డెయిరీ సహకార సంఘము ను గురువారం నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందని మహిళా డైరీ సహకార సంఘం నోడల్ అధికారి డాక్టర్ జి.నారాయణరావు తెలిపారు. మన మండలంలో ఇదే మొట్టమొదటి మహిళా డైరీ సహకార సంఘం. ఈ సంఘానికి ప్రభుత్వం తరపున మూడు నెలలపాటు తాత్కాలిక రిజిస్ట్రేషన్/గుర్తింపు కూడా చేయబడినది. వీళ్ల తదుపరి మూడు నెలలు క్రమంగా పాలు పోసినట్లయితే ఈ సంఘంను శాశ్వతంగా రిజిస్టర్ చేయబడుతుందని, శాశ్వతం గుర్తింపు వచ్చిన తరువాత నుండి వీరికి ఏవైనా పథకాలు అందించుటలో ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమమునకు నోడల్ పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.ఓంకార్, మండల పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, హెరిటేజ్ సిబ్బంది, నాళ్ళ చిన్ని, నాళ్ళ రాంబాబు, పాడి రైతులు పాల్గొనడం జరిగినది.

## మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ



కంచిలి, జనవరి 29 ప్రభాతవార్త కంచిలి మండలం, జలంత్రకోట గ్రామంలో నూనె గింజల జాతీయ మిషన్‌లో భాగంగా, జిల్లా వనరుల కేంద్రం, శ్రీకాకుళం వారు రబీ 2025-26 సీజన్‌లో నువ్వులు, అపరాలు వేరుశెనగ పంటలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నువ్వులు, అపరాలు వేరుశెనగ పంటలో ఎరువుల యాజమాన్యం, పురుగు, తెగులు యాజమాన్యం గురించి వివరంగా రైతులకు తెలియపరిచి, రైతుల సాగు సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారం తెలియజేసారు. అదే విధముగా యూరియా అధికంగా వాడడం వలన కలిగే దుష్ప్రభావాలు మరియు పంట అవశేషాలు కాల్చడం వల్ల నష్టాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరులు కేంద్రం ఏడీఏ సీహెచ్. వెంకటరావు, వ్యవసాయ పరిశోధన కేంద్రం, రాగోలు శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయ బాబు, మండల వ్యవసాయాధికారి కొంకేన సురేష్ వీఏఏ శ్రీకాంత్, గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



ఇచ్ఛాపురం, జనవరి 29 ప్రభాతవార్త: రోటరీ ఇచ్ఛాపురం వ్యవస్థాపన దినోత్సవ వేడుకలు క్లబ్ చార్టర్ నైట్ హంగామా జరుపుకున్నారు. 1987 జనవరి 28 రోటరీ క్లబ్ ఇచ్ఛాపురంలో స్థాపించడం జరిగింది. ఆనాటి మొదటి ప్రెసిడెంట్‌గా డాక్టర్ త్రినాధరెడ్డి 39వ వసంతాల వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇద్దరు విశిష్ట సేవలు చేసిన వ్యక్తులకు సన్మానించారు. వసంత గోవిందరావు (108 వాహనం డ్రైవర్) కాళ్ల ధనుంజయరావు(కళాకారుడు) సమాజంలో వీరి సేవలను గుర్తించి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. 2026-27 నూతన ప్రెసిడెంట్‌గా డాక్టర్ వేదవ్యాస్ (గ్లోబల్ డెంటల్ హాస్పిటల్)ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఆలీ బేకరీ 39వ వసంతాల కేకును అందించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ మోహన్ వెంకటేష్ కార్యదర్శి రామకోటి రోటరీ సభ్యులు డి.గోపాలరావు, అమీర్ ఆలీ, మధుకుమార్, సురేష్, దినేష్, జయదేవ్, నవీన్ చౌదరి, కిరణ్ కుమార్ దాసు, బి శ్రావణ్ కుమార్, రాజ్ కుమార్, కె రామారావు, జోగారావు, ప్రపుల్ల కుమార్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు దశల వారీగా పోరాటం



సరుబుజ్జిలి, జనవరి 29 ప్రభాతవార్త : 11వ పిఆర్‌సీ గడువు పూర్తయి 30 నెలలు గడిచిన 12వ పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయక పోవడం, 34 వేలకోట్ల బకాయిల చెల్లించక పోవడం, ఉద్యోగ, ఉపాధ్యాయలకు నాలుగు డి.ఏలు చెల్లించక తాత్సర్యం వహించడం తదితర డిమాండ్లు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైనందున, పై డిమాండ్ల సాధనకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం దశలవారి పోరాటాలకు పిలుపునిచ్చిందని ఎస్.టీ.యు. రాష్ట్ర నాయకులు ఎస్.వి.రమణమూర్తి తెలిపారు. గురువారం సరుబుజ్జిలి మండలం, రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఎస్.టీ.యు. దశల వారి పోరాట కరపత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణారావు మరియు ఉపాధ్యాయుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్.టీ.యు. రాష్ట్ర నాయకులు ఎస్.వి.రమణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం 23 వేల కోట్ల ఉపాధ్యాయ, ఉద్యోగులకు బకాయిలు ఉండగా, ఈ ప్రభుత్వం దాన్ని చెల్లించకపోగా ఆ బకాయిలను మరొక 10 కోట్లకు పెంచిందని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చెల్లించాల్సిన కరువు భత్యం కూడా అరువు భత్యం చేస్తున్న పరిస్థితి దాపురించిందని, వెంటనే పిఆర్సి కమిషన్ నియమించి 30 శాతం మధ్యంతర భృతి చెల్లించి పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, పై సమస్యల సాధనకు ఎస్టీయు దశలవారి పోరాటంలో భాగంగా జనవరి 30న అన్ని మండల తహసిల్దార్లకు వినతిపత్రాలు సమర్పణ, ఫిబ్రవరి 10వ తేదీన రాష్ట్రంలో అన్ని జిల్లా కలెక్టరేట్లలో ధర్నా మరియు ఫిబ్రవరి 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ సమస్యల సాధన కొరకు చేసే పోరాటంలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## సచివాలయాలపై కూన రవికుమార్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దారుణం



### -వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్

ఆమదాలవలస, జనవరి 29 (ప్రభాతవార్త) అంతర్జాతీయ ప్రశంసలు పొందిన సచివాలయ వ్యవస్థను దరిద్రాలయాలనడం కూన రవికుమార్ అవివేకానికి నిదర్శనమని వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్ఫూర్తితో, పరిపాలన వికేంద్రీకరణే ధ్యేయంగా ఏర్పడిన ఈ వ్యవస్థను అవమానించడం అంటే ప్రజలను అవమానించడమేనని అన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రపంచస్థాయిలో ఈ వ్యవస్థకు గుర్తింపు పొందిందన్నారు. ఉదాహరణగా చూస్తే సచివాలయ వ్యవస్థలో సాంకేతికతను వాడుతున్న తీరును మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ స్వయంగా ప్రశంసించారని గుర్తు చేశారు. అవినీతిని అరికట్టడానికి, సేవల పంపిణీలో జాప్యం తగ్గించడానికి ఇది ఒక 'మంచి మోడల్' అని నీతి ఆయోగ్ తన నివేదికల్లో అభినందించిందని తెలిపారు.

### జాతీయ అవార్డులు..

సుపరిపాలన విభాగంలో ఈ వ్యవస్థకు పలుమార్లు జాతీయ స్థాయి స్కోచ్ అవార్డులు లభించాయిని అన్నారు. మన సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శం. 2022లో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఏపీ సచివాలయ నమూనాను పరిశీలించి, తమ రాష్ట్రంలోనూ ఇలాగే నిర్మిస్తామని ప్రకటించారు. అలాగే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సలహాదారులు కూడా ఇక్కడి ఆర్.బి.కె లు, సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని కొనియాడారు. వైకాపా ప్రభుత్వంలో భారీ ఉద్యోగ కల్పన ఏకంగా 1.5 లక్షల మంది యువతకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించి వారిని పరిపాలనలో భాగస్వాములను చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సచివాలయ వ్యవస్థపై విషం చిమ్ముతూ, సిబ్బందిని దూషిస్తూ వారిని ఆందోళన పరచడం దారుణమన్నారు. సచివాలయ సిబ్బందిపై చిన్నచూపు చూపడం మానుకోవాలని, కాకపోతే రానున్న ఎన్నికల్లో ప్రజలు, సచివాలయ ఉద్యోగులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## స్పందించిన ఇద్దివానిపాలెం యువత



కవిటి, జనవరి 29 (ప్రభాతవార్త) మండలం ఇద్దివానిపాలెం పంచాయతీ ఇద్దివానిపాలెం గ్రామానికి ఆనుకొని ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు గత 15 రోజులుగా నీటితో నిండి అపారిశుద్ధ్యానికి చిరునామాగా మారింది. దీనివల్ల గ్రామంలో ఉన్న విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు నానా అవస్థలు పడడమే కాకుండా వారి అనారోగ్యానికి కూడా కారణభూతం అవుతుంది. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే పైపులైన్లు లీకై ఈ రోడ్లపై గత రెండు నెలల కాలంగా నీరు నిల్వ ఉండటం జరిగిందని దీనివలన పాఠశాలకు విద్యార్థులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని ఆ గ్రామానికి చెందిన యువత ప్రభాతవార్త వద్ద ఆందోళన చెందారు. దీంతో గ్రామానికి చెందిన యువత గురువారం నాడు నడుము కట్టి స్వచ్ఛందంగా రోడ్డుపై నిల్వ ఉన్న మురుకు నీరును తొలగించే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. వీరంతా ప్రభాత వార్తతో మాట్లాడుతూ ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ మరియు ఉద్దానం ప్రదీప్ సిబ్బంది ఈ పైపులైన్ల లీకేజీలను సరిచేసి రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కోరారు. దామోదర్, నాగరాజు, పురుషోత్తం, నేతాజీ, ఆనంద్, పాపయ్య, జితేందర్, మణి, శేఖర్‌లు పాల్గొన్నారు.

## మహేష్‌ను ఆశీర్వదించిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్




వీరఘట్టం, జనవరి 29 ప్రభాతవార్త : వీరఘట్టం మండల సీనియర్ నాయకులు, విక్రమపురం గ్రామ సర్పంచ్ మాచర్ల మహేష్ బీజేపీ పార్టీలో చేరిన సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాచర్ల మహేష్‌ను ఆశీర్వదించారు. బిజెపి పార్టీలో చేరిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ చేతుల మీదుగా ఆయన కండువ వేసుకొని బిజెపి పార్టీలో చేరిన సంగతి పాఠకులకు విధితమే. అయితే ఒకరు కేంద్ర సహాయ మంత్రి, ఇంకొకరు రాష్ట్ర అధ్యక్షులు కలిసి స్వయంగా మహేష్‌ను అభినందిస్తూ పార్టీ కోసం కష్టపడి పని చేసి మంచి నాయకునిగా గుర్తింపు తెచ్చుకోవాలని వారు సూచించారు. కేంద్ర పథకాలన్నీ ప్రజలకు చేరువయ్యే విధంగా చూడాలన్నారు.

## సిఆర్ఎంటి మోహన్‌రావుకు సన్మానం




ఇచ్ఛాపురం, జనవరి 29 ప్రభాతవార్త: మండల విద్యా వనరుల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నటువంటి సిహెచ్ మోహన్ రావు (సిఆర్ఎంటి)ని జిల్లా ఉత్తమ సిఆర్ఎంటిగా 77వ గణతంత్ర దినోత్సవం రోజున సమగ్ర శిక్ష శ్రీకాకుళం అధికారులచే అవార్డు పొందిన సందర్భంగా ఇరువురి ఎంఈఓలు అప్పారావు, విశ్వనాథం తోటి సిఆర్ఎంటిలు, కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. మోహన్ సేవలను కొనియాడుతూ మోహన్‌ని పలువురు అభినందనలు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కురుమన అప్పారావు, ఎస్.విశ్వనాథం, ఇచ్ఛాపురం ప్రధానోపాధ్యాయులు కే.సూర్యరావు, సిఆర్ఎంపీలు దేవరాజు, సోమేశ్వరరావు, సత్యనారాయణ, బడియా గణేష్, కృష్ణమూర్తి కామేశ్వరరావు, ఆసి రవికుమార్ రెడ్డి, మెసెంజర్ ఎం.రాంబాబు మరియు మండల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## బీష్మ ఏకాదశి సందర్భంగా అన్నదానాలు



కోటబొమ్మాళి, జనవరి 29(ప్రభాతవార్త): బీష్మఏకాదశి సందర్భంగా కోటబొమ్మాళి మేజరు పంచాయతీ రెడ్డికవీధిలో గురువారం సుమారు 3వేల మందికి టీడీపీ సీనియర్ నాయకులు కల్లి లక్ష్మణరెడ్డి, నాగయ్యరెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే కొత్తపేట పంచాయతీ తారకరామ కాలనీ శ్రీరామ మందిరం వద్ద సుమారు 3వేలు మందికి అన్నసమారాధన చేసినట్లు గ్రామ పెద్దలు, యువకలు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కిష్టుపురం, కొటబొమ్మాళి, జర్జంగి, పాకివలస, గుంజిలోవ తదితర గ్రామాలనుంచి భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

# శ్రీకాకుళం వార్త



## కొత్తూరు శ్రీవారికి వెండి హారం

### 14 కేజీల వెండితో దాతల సహకారంతో రూపకల్పన ..శిల్పి చింద్రాడ వరప్రసాదరావు దంపతులకు ఘన సన్మానం



కొత్తూరు, జనవరి 29 (ప్రభాతవార్త ): భీష్మ ఏకాదశి పుణ్యదినాన్ని పురస్కరించుకుని కొత్తూరు మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం భక్తి పారవశ్యంతో పులకించింది. స్వామివారికి భక్తులు, దాతల సహకారంతో సమర్పించిన భారీ వెండి మకర తోరణాన్ని గురువారం అత్యంత వైభవంగా ఆవిష్కరించారు. సుమారు 14 కేజీల వెండితో అత్యంత నైపుణ్యంతో రూపొందించిన ఈ మకర తోరణాన్ని పాతపట్నం సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు కలిసి స్వామివారికి అలంకరించి ఆవిష్కరించారు. మకర తోరణం అలంకరణ తర్వాత స్వామివారి రూపం వెండి కాంతులతో వెలిగిపోతుండటం భక్తులను కట్టిపడేసింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ అద్భుతమైన వెండి మకర తోరణాన్ని అత్యంత కళాత్మకంగా మలిచిన శిల్పి చింద్రాడ వరప్రసాదరావు ఆచార్య దంపతులను ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. స్వామివారి సేవలో భాగస్వాములైనందుకు వారిని అభినందిస్తూ జ్ఞాపికలను అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, సత్యసాయి బాబా ఆర్గనైజర్ లోతుగెడ్డ భగవాన్ దాస్ నాయుడు, బీజేపీ జిల్లా కార్యదర్శి కె దమయంతి, ఎంపిటిసి వడ్డీ గౌరీ కుమార్, మాజీ సర్పంచ్ పడాల వెంకట కృష్ణ పాల్గొన్నారు, కొమనాపల్లి ప్రసాద్ నాయుడు, గుడ్ల కృష్ణారావు, ఎక్సైజ్ సిఐ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, కొత్తూరు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


## కొత్తమ్మతల్లిని దర్శించుకున్న జూనియర్ సివిల్ జడ్జి వాణి



కోటబొమ్మాళి, జనవరి 29 (ప్రభాతవార్త): స్థానిక కొత్తమ్మతల్లి అమ్మవారిని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షురాలు (ఎఫ్ఏసీ) ఎస్.వాణి గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాక్రిష్ణ వారిచే ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మంచాల వెంకటరావు, దేవాది లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## చెట్ల తాండ్రలో ఘనంగా భీష్మ ఏకాదశి పండగ

### -భక్తులతో కిటకిటలాడిన చెట్ల తాండ్ర .. అరటి గెలలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు




సంతబొమ్మాళి, జనవరి 29 ప్రభాతవార్త : భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని చెట్లతాండ్ర గ్రామంలో అరటి గెలలు పండగ గురువారం ఘనంగా జరిగింది. శ్రీ పరావస్తు అయ్యావారు ఆలయం (లక్ష్మీనరసింహ స్వామి) వద్ద అరటి గెలలు పండగ రెండు రోజులు పాటు జరుగుతుంది. ఏటా భక్తులు అయ్యావారికి అరటి గెలలు కట్టి వారి మొక్కలు తీర్చుకోవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. వేకువ జాము నుంచే అయ్యావారికి పూజలు ప్రారంభమయ్యాయి. స్థానిక ఆలయ కమిటీ సభ్యులు ఆలయం చుట్టూ కర్రలతో పందిరి వేసి భక్తులు తెచ్చే అరటి గెలలు ఆ పందిరికి వేలాడదీస్తారు. ఈ ఏడాది సుమారు 8వేల గెలలు రావడం విశేషం. ఈ ఉత్సవాలకు మండలం నలుమూలల నుండి కాకుండా టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, పలాస, నరసన్నపేట, పాతపట్నం, శ్రీకాకుళం తదితర మండలాలకు చెందిన లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి



వారి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఒడిస్సా రాష్ట్రం నుంచి కూడా భక్తులు ఈ ఉత్సవాలకు తరలి రావడం విశేషం. ఈ ఉత్సవాలకు తెలుగుదేశం పార్టీ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు, టెక్కలి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి పేడాడ తిలక్, సంతబొమ్మాళి, టెక్కలి జడ్పీటీసీ పాల వసంతరెడ్డి, దువ్వాడ వాణిలు వచ్చి పరావస్తు అయ్యావారు దర్శించుకున్నారు. అలాగే తహసీల్దార్ హేమ సుందర్, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ పరవస్తూ అయ్యావారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 12:00 వరకు భక్తులెక్కువగా రావడంతో అయ్యావారి దర్శనాలకు జన సందోహం ఏర్పడింది. అయితే సాయంత్రానికి భక్తులు రాక తగ్గడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంతబొమ్మాళి పోలీస్టేషన్ ఎస్ఐ సింహాచలం ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. ఈ పండగ సందర్భంగా రాత్రి వేళలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

## అపవిత్ర రాజకీయంపై ఆధ్యాత్మిక విజయం : మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

### లడ్డూ వివాదంలో అబద్ధాలు వీడాయి... నిజాలు నిలబడ్డాయి



పాతపట్నం, జనవరి 29 ప్రభాతవార్త: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో అప్పటి వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంపై టీడీపీ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు చేసిన ఆరోపణలు కేవలం రాజకీయ మళ్లింపు కుట్రలేనని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. సిబిఐ దర్యాప్తులో నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని తేలడంతో, సత్యం గెలిచినందుకు కృతజ్ఞతగా గురువారం పాతపట్నం శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, 108 కొబ్బరికాయలు కొట్టారు. ఐసీఈఆర్, ఎన్డి, డివి ల్యాబ్‌లలో జరిగిన పరీక్షలను సిబిఐ క్షుణ్ణంగా పరిశీలించిందని వైఎస్ఆర్సీపీ హయాంలో వాడిన నెయ్యిలో ఎలాంటి అపవిత్రత లేదని శాస్త్రీయంగా తేలిపోయిందని ఆమె పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలోని వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ లడ్డూ డ్రామా ఆడారని, దానికి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వత్తాసు పలకడం దురదృష్టకరమని విమర్శించారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ఆడుకున్న చంద్రబాబు కుతంత్రం, స్వతంత్ర సిట్ మరియు సిబిఐ నేతృత్వంలోని విచారణతో అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం లడ్డూ రాజకీయాలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైకాపా ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## టెన్త్‌లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి



సీతంపేట, జనవరి 29 ప్రభాతవార్త : టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో గిరిజన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలిని ఐటిడిఏ డిప్యూటీ డీఈవో పి.నారాయడు స్పష్టం చేశారు. గురువారం బుడగరాయి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుండే ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక పాఠ్యాంశాలు బోధించాలన్నారు. ముస్తాబు కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని రికార్డులు నిర్వహణ సక్రమంగా జరగాలని అన్ని రికార్డులు నిర్వాహన సక్రమంగా ఉంచాలన్నారు. బుడగరాయ జిపిఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ రాములమ్మ హెచ్ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమృత్యుంజయేశ్వర స్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవం



కవిటి, జనవరి 29 ప్రభాతవార్త: శ్రీమృత్యుంజయేశ్వర స్వామి ఆలయం ముత్యాలపేటలో ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ జరిగింది. మహా మంత్రం అలాగే ఇచ్ఛాపురం శ్రీ వెంకటేశ్వర డాన్స్ అకాడమీ వారిచే భరత నాట్యం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శివ స్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం జయప్రదం చేశారు.

